క్లుప్తంగా

మురుగునీటి సమస్యపై చర్యలు తీసుకోవాలి



తాడేపల్లి రూరల్‌: తాడేపల్లి ప్రాంతంలో అపార్ట్‌మెంట్‌ వాసులు ఎదుర్కొంటున్న మురుగునీటి సమస్యపై చర్యలు తీసుకోవాలని మాజీ ఎంపీ పి. మధు అధికారులను కోరారు. బుధవారం తాడేపల్లి బైపాస్‌ రోడ్‌లోని పెట్రోల్‌ బంక్‌ సమీపంలో వున్న పలు అపార్ట్‌మెంట్‌లను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అపార్ట్‌మెంట్‌లో నివసిస్తున్న వారు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. తగిన చర్యలు వెంటనే తీసుకోవాలని ఎంటీఎంసీ కమిషనర్‌కు లేఖ రాశారు.

బహిరంగ ప్రదేశాలలో మద్యం తాగితే చర్యలు

మంగళగిరి: బహిరంగ ప్రదేశాలలో మద్యం తాగే వారిపై కఠిన చర్యలు తప్పవని రూరల్‌ ఎస్‌ఐ వెంకటేశ్వర్లు తెలిపారు. నగర పరిధిలోని కాజలో బుధవారం రాత్రి ఇద్దరు మందు బాబులను అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ వెంకట్‌ మాట్లాడుతూ నిరంతరం డ్రోన్‌ కెమెరా నిఘా ఏర్పాటు చేసి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

పశువులకు టీకాలు



ఫిరంగిపురం: మండలంలోని మేరికపూడి గ్రామంలో పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేసినట్లు నుదురుపాడు పశువైద్యాధికారి పీర్‌ అహ్మద్‌ బుధవారం తెలిపారు. ఇప్పటివరకు గ్రామంలో 200 గేదెలు, 12 ఎద్దులకు టీకాలు వేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో పశువైద్యసిబ్బంది పాల్గొన్నారు.

ఏపీవోగా కిరణ్మయి బాధ్యతల స్వీకరణ



ఫిరంగిపురం: ఉపాధి హామీ పథకం మండల ఏపీవోగా ఎంకే కిరణ్మయి బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు మేడికొండూరు మండల ఏపీవోగా, తాడికొండ ఇన్‌చార్జిగా ఆమె బాధ్యతలు నిర్వర్తించారు. సాధారణ బదిలీల్లో భాగంగా ఫిరంగిపురం వచ్చారు. ఈ సందర్భంగా కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం సక్రమంగా అమలయ్యేలా చూస్తానన్నారు. పశువుల పాకల నిర్మాణం, కంపోస్టు గుంటలు ఏర్పాటు వంటివి రైతులకు వివరించనున్నట్లు తెలిపారు.

నేడు ఆరోగ్య మిత్రల నిరసన

మంగళగిరి: రాష్ట్రవ్యాప్తంగా ఎన్టీఆర్‌ వైద్యసేవ ఆరోగ్యమిత్ర ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని గురువారం నిరసన చేపట్టనున్నారు. దీనిని విజయవంతం చేయాలని ఆరోగ్య మిత్ర రాష్ట్ర కమిటీ బుధవారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చింది. మంగళగిరి ఎయిమ్స్‌ ఆవరణలోని ఎన్టీఆర్‌ వైద్య సేవ ట్రస్ట్‌ రాష్ట్ర కార్యాలయం ఎదుట గురువారం ఉదయం 11 గంటలకు నిరసన ఉంటుందని తెలిపింది. ఆరోగ్య మిత్ర ఉద్యోగులు అందరూ పాల్గొని జయప్రదం చేయాలని ప్రతినిధులు కోరారు.

అరుణాచలానికి ప్రత్యేక బస్సులు

పట్నంబజారు: పవిత్రమైన అరుణాచల పుణ్యక్షేత్రానికి ఏప్రిల్‌ 12న పౌర్ణమి పురస్కరించుకుని గిరిప్రదక్షిణ మహోత్సవానికి ప్రత్యేక ఆర్టీసీ సర్వీసులు ఏర్పాటు చేస్తున్నట్లు ఆర్టీసీ అధికారులు వెల్లడించారు. ఏప్రిల్‌ 10 రాత్రి 9 గంటలకు గుంటూరులో బయల్దేరి, 11వ తేదీ శ్రీకాళహస్తి, కాణిపాకం, గోల్డెన్‌ టెంపుల్‌ దర్శించుకుని, అదేరోజు రాత్రి అరుణాచలం చేరుకుంటుందన్నారు. ఏప్రిల్‌ 12 ఉదయం గిరి ప్రదక్షిణ చేసుకుని స్వామివారి దర్శనం అనంతరం అదేరోజు సాయంత్రం అరుణాచలంలో ప్రయాణికులను ఎక్కించుకుని 13వ తేదీ ఉదయం గుంటూరు చేరుకుంటుందని తెలిపారు. ఆన్‌లైన్‌ ద్వారా రిజర్వేషన్‌ చేసుకోదలచిన వారు 96164 నంబరు ద్వారా రిజర్వేషన్‌ చేసుకోవాలని కోరారు. టికెట్టు ధర రూ.2,420 నిర్ణయించినట్టు చెప్పారు. మరింత సమాచారం కోసం 7382894613 నంబరులో సంప్రదించాలని కోరారు.


నర్సింగ్‌ సిబ్బందికి పుస్తకాలు, యూనిఫాం అందజేత

గుంటూరు మెడికల్‌: నర్సు ప్రాక్టీషనర్‌ మిడ్‌వైఫరీ కోర్సు అభ్యసిస్తున్న నర్సింగ్‌ సిబ్బందికి బుధవారం గుంటూరు జీజీహెచ్‌ ఆరోగ్య శాఖ ప్రాంతీయ సంచాలకులు డాక్టర్‌ అనిల్‌కుమార్‌ పుస్తకాలు, యూనిఫాం అందజేశారు. గుంటూరు ప్రభుత్వ నర్సింగ్‌ కళాశాలలో శిక్షణ పొందుతున్న 30 మంది నర్సింగ్‌ సిబ్బందికి గైనకాలజీ టెక్స్ట్‌బుక్స్‌, బర్త్‌ పోజిషన్స్‌ గైడ్‌లైన్‌ బుక్స్‌, యూనిఫాం, షూస్‌, సుమారు రూ.3 వేల విలువ చేసే కిట్లు అందజేశారు.

ముంచుకొస్తున్న తాగునీటి ముప్పు



ఆత్మకూరు తాగునీటి పథకం



నిరుపయోగంగా చేతిపంపు

- ఆత్మకూరులో రెండు రోజులకొకసారి సరఫరా
- తీవ్ర ఇబ్బందులు పడుతున్న స్థానికులు
- మంగళగిరికి తగ్గుతున్న తాగునీటి సరఫరా

మంగళగిరి: కృష్ణా నది పక్కనే ఉన్న మంగళగిరికి ప్రతి వేసవిలో తాగునీటి ఎద్దడి తప్పడం లేదు. నగర పరిధిలోని ఆత్మకూరు ఎస్సీ పల్లెలో సుమారు వెయ్యి కుటుంబాలు నివాసం ఉంటున్నాయి. వీరందరూ కూలి నాలి చేసుకునే వారే. పక్కనే గుంటూరు చానల్‌, మంగళగిరి తాగునీటి సరఫరా పథకం ఉన్నాయి. అయినా ఆత్మకూరులో పలు పోట్ల తాగునీటి ఎద్దడి నెలకొంది. నెల రోజులుగా ఎస్సీ పల్లెలకు రెండు రోజుల కొకసారి తాగునీరు సరఫరా అవుతుంది. దానిలోని చేతిపంపులు పాడవడంతో నీటికి ఇబ్బందిగా మారింది. రెండు రోజుల కొకసారి సరఫరా అవుతోంది. వేళాపాళా లేకుండా రాత్రివేళ సైతం నీరు విడుదల చేస్తున్నారు. దీంతో నీటి కోసం స్థానికులు రోజంతా ఎదురు చూడాల్సి వస్తోంది. కూలికి వెళ్లే వారి పూట గడవని వారు కావడంతో నీటి కోసం ఎలా ఇంటి వద్ద ఉండాలని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అరగంటలోపే నీటిసరఫరా నిలిపి వేస్తుండడంతో అవి ఎటూ సరిపోక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గతంలో ఎన్నడూ నీటి ఎద్దడి ఇంతగా ఎదుర్కోలేదని వాపోతున్నారు. అధికారులు స్పందించి నిర్ణీత సమయంలో తగినంత నీరు సరఫరా చేయాలని స్థానికులు కోరుతున్నారు.

వేళాపాళా లేకుండా విడుదల



తాగునీటి సరఫరా వేళాపాళా లేకుండా చేస్తుండడంతో చాలా ఇబ్బంది పడుతున్నాం. గతంలో ప్రతి రోజు గంటకుపైగా సరఫరా చేసేవారు. ఇప్పుడు రెండు రోజులకొకసారి ఎంత సమయం సరఫరా అవుతుందో కూడా తెలియకుండా ఉన్నాము. కూలికి వెళ్లే మాలాంటి వాళ్లం పనులు మానుకుని నీటి కోసం ఎదురుచూడాల్సి వస్తోంది.

– బండపల్లి ఆదెమ్మ

సరిపడా సరఫరా చేయాలి



అర్ధరాత్రి వేళ నీరు సరఫరా చేస్తే నాలాంటి వృద్ధులు ఎలా పట్టుకుంటారు? సమయం లేకుండా ఎప్పుడంటే అప్పుడు ఇస్తున్నారు. రెండు రోజులకొకసారి కొద్ది సేపు సరఫరా చేస్తుండడంతో నీరు ఎటూ సరిపోక ఇబ్బందులు పడుతున్నాం.

– గరికపాటి పిచ్చమ్మ

ప్రజాక్షేత్రం నుంచి పుట్టిన పార్టీ వైఎస్సార్‌ సీపీ



మాట్లాడుతున్న దొంతిరెడ్డి వేమారెడ్డి



హాజరైన నాయకులు, కార్యకర్తలు

- పార్టీ ఆవిర్భావం నుంచి దళితులకు ఎంతో ప్రాధాన్యత
- గతంలో ఎన్నడూ లేని విధంగా సర్కారుపై ప్రజల్లో వ్యతిరేకత
- మంగళగిరి నియోజకవర్గ సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి

మంగళగిరి: ప్రజా క్షేత్రం నుంచి ఆవిర్భవించిన పార్టీ వైఎస్సార్‌ కాంగ్రెస్‌ పార్టీ అని మంగళగిరి నియోజకవర్గ సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి తెలిపారు. బుధవారం రాత్రి నగర పరిధిలో నవులూరులో పార్టీ మండల అధ్యక్షుడు నాలి వెంకట్రావు అధ్యక్షతన ముఖ్య నాయకులు, కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా వేమారెడ్డి మాట్లాడుతూ వైఎస్సార్‌ సీపీ పెట్టినప్పటి నుంచి గతంలో ఎన్నడూ లేని విధంగా దళితులకు పార్టీ అత్యున్నత స్థానం కల్పించిందన్నారు. పార్టీ పెట్టిన నాటి నుంచి నవులూరు ఎంతో ఎక్కువగా పార్టీని ఆదరించడం అభినందనీయమన్నారు. ప్రస్తుత టీడీపీ ప్రభుత్వంలో దళితులపై దాడులు పెరిగిపోయాయని, తగిన సమయంలో దళితులు ఆ పార్టీకి బుద్ధి చెబుతారన్నారు. సోషల్‌ మీడియా యాక్టివిస్టులపై అక్రమ కేసులు పెట్టి వేధిస్తున్నారని ఆరోపించారు. కూటమి ప్రభుత్వ బెదిరింపులకు వైఎస్సార్‌ సీపీ నాయకులు, కార్యకర్తలు భయపడేది లేదని చెప్పారు. కూటమి ప్రభుత్వ అరాచకాలను, దౌర్జన్యాలను వైఎస్సార్‌ సీపీ ఎదుర్కొంటుందని పేర్కొన్నారు. అధికారంలోకి వస్తే సూపర్‌సిక్స్‌ పథకాలతో ప్రజల జీవితాలను మార్చుతానని ప్రగల్భాలు పలికిన ముఖ్యమంత్రి చంద్రబాబు మాటతప్పారని చెప్పారు. ప్రజా సమస్యలు గాలికొదిలేసి రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగాలేకపోవడంతోనే పథకాలు అమలు చేయలేకపోతున్నామని చెప్పడం చంద్రబాబుకే చెల్లిందన్నారు. పార్టీకి బలం కార్యకర్తలేనని, ఏ ఒక్కరికి కష్టం వచ్చినా పార్టీ అండగా ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ బీసీ సెల్‌, ఎస్సీ సెల్‌ కన్వీనర్లు తాడిబోయిన సుబ్బారావు, కట్టెపోగు భూషణం, మాజీ ఎంపీపీ పచ్చల రత్నకుమారి, జిల్లా కార్యదర్శులు ఈపూరి ఆదామ్‌, పచ్చల శ్యాంబాబు తదితరులు పాల్గొన్నారు.

రహదారి నిర్మాణం వెంటనే పూర్తిచేయాలి



ప్రజా సంఘాల నాయకులతో కలిసి పర్యటిస్తున్న మాజీ ఎంపీ పి.మధు

తాడేపల్లి రూరల్‌: ఎంటీఎంసీ పరిధిలోని కేఎల్‌ యూ నుంచి రేవేంద్రపాడు వరకు పీడబ్ల్యూడీ రహదారి నిర్మాణం వెంటనే పూర్తిచేయాలని మాజీ ఎంపీ పి.మధు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్‌ చేశారు. బుధవారం మెల్లెంపూడి గ్రామంలో ప్రజా సంఘాల నాయకులతో కలిసి ఆయన స్థానిక వసతులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విజయవాడ – తెనాలి మార్గంలోని ఈ రోడ్డును వెంటనే ప్రభుత్వం పూర్తి చేయాలని అన్నారు. డ్రైనేజీ, రోడ్డు, తాగునీటి సమస్యలు పరిష్కారం కోసం కార్యాచరణ కమిటీ ఏర్పడిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం గుంటూరు జిల్లా అధ్యక్షులు జొన్న శివశంకరరావు, సీఐటీయూ తాడేపల్లి పట్టణ కార్యదర్శి బూరగ వెంకటేశ్వరరావు, రైతు సంఘం నాయకులు పల్లె కృష్ణ, సీఐటీయూ నాయకులు కంచర్ల సాంబశివరావు, నాగపోగు విజయరాజు, కొట్టే కరుణాకరరావు, కంచర్ల జేమ్స్‌ తదితరులు పాల్గొన్నారు.

ఫైలేరియాపై అవగాహన కార్యక్రమం



ఫైలేరియా బాధితులకు కిట్‌ అందిస్తున్న డాక్టర్‌ అనూష

తాడేపల్లి రూరల్‌: తాడేపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో బుధవారం ఫైలేరియా వ్యాధిపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాన డాక్టర్‌ అనూష మాట్లాడుతూ ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. మురుగునీరు నిల్వ లేకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. దోమలు కుట్టకుండా తెరలు వాడాలని, నివాసాల్లో నీటి తొట్లు, పూల కుండీలు, ఖాళీ డబ్బాల్లో నీరు నిలువ లేకుండా చూసుకోవాలని అన్నారు. అనంతరం తాడేపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఫైలేరియా వ్యాధి గ్రస్తులకు అవసరమైన మందులు, సామగ్రి అందజేశారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌ఓ గురుకుమార్‌, ఎస్‌ఈఓ సుధీర్‌ కుమార్‌, సూపర్‌వైజర్లు శంకరరావు, రమాదేవి, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

వాహనాలకు జీపీఎస్‌ ట్రాకర్‌తో భద్రత



అవగాహన కల్పిస్తున్న విద్యార్థులు

తాడేపల్లి రూరల్‌: వడ్డేశ్వరం కేఎల్‌ యూనివర్సిటీ ఎన్‌ఎస్‌ఎస్‌, సీఎస్‌ఈ హానర్స్‌ విభాగం ఆధ్వర్యంలో వలంటీర్లు వాహనాలకు జీపీఎస్‌ ట్రాకర్‌పై అవగాహన కార్యక్రమాన్ని బుధవారం వడ్డేశ్వరంలో నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థి విభాగాధిపతి డాక్టర్‌ కేఆర్‌ఎస్‌ ప్రసాద్‌ మాట్లాడుతూ వాహనదారులు జీపీఎస్‌ ట్రాకర్‌ ఏర్పాటు చేసుకోవడం ఎంతో ఉపయోగకరమని వివరించారు. కేవలం రూ.800 నుంచి ఈ పరికరం అందుబాటులోఉంటుందని ఎన్‌ఎస్‌ఎస్‌ ప్రోగ్రామ్‌ కో ఆర్డినేటర్‌ డాక్టర్‌ పి. శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమ సమన్వయకర్త పి. సురేష్‌, వలంటీర్లను యూనివర్సిటీ వీసీ డాక్టర్‌ జి.పార్థసారథ వర్మ, ప్రో వీసీలు డాక్టర్‌ ఏవీఎస్‌ ప్రసాద్‌, డాక్టర్‌ కె.రాజశేఖరరావు, డాక్టర్‌ ఎన్‌.వెంకట్రామ్‌, సీఎస్‌ఈ హానర్స్‌ విభాగాధిపతి డాక్టర్‌ సెంథిల్‌ తదితరులు అభినందించారు.

ఏవోపై చర్యలు తీసుకోవాలని డిమాండ్‌



కమిషనర్‌ డాక్టర్‌ సిరికి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

తాడేపల్లి రూరల్‌: ఏవో రామ్‌ప్రసాద్‌పై చర్యలు తీసుకోవాలని కోరుతూ సీపీఐ ఎంఎల్‌ – న్యూ డెమోక్రసీ నాయకులు బుధవారం తాడేపల్లిలోని ఆంధ్రప్రదేశ్‌ రాష్ట్ర వైద్య విధాన పరిషత్‌ కమిషనర్‌ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గుంతకల్‌ ప్రభుత్వ ఆసుపత్రిలో ఏవో రామ్‌ప్రసాద్‌ అక్కడి మహిళా సిబ్బందిని లైంగిక వేధింపులకు గురిచేస్తూ అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్నారని జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో రెండుసార్లు ఎంక్వయిరీ జరిగిందన్నారు. ప్రభుత్వం చర్యలు చేపట్టకపోవడం విచారకరమని పేర్కొన్నారు. దీనికి నిరసనగా ధర్నా నిర్వహించామని పేర్కొన్నారు. అధికారులు స్పందించి ఆతనిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్‌ చేశారు. అనంతరం కార్యాలయ కమిషనర్‌ డాక్టర్‌ సిరికి వినతిపత్రం అందజేశారు. తగిన చర్యలు తీసుకుంటామని ఆమె హామీ ఇచ్చారు. కార్యక్రమంలో అనంతపురం జిల్లా కమిటీ సభ్యులు రఘునాథరెడ్డి, రామాంజనేయులు, సత్తార్‌, ఉమేష్‌, నాగరాజు, రాయల్‌, జానయ్య, పీడీఎస్‌యూ రాష్ట్ర కమిటీ సభ్యులు రాజేష్‌ తదితరులు పాల్గొన్నారు.

పాస్టర్‌ ప్రవీణ్‌ మృతిపై సమగ్ర విచారణ చేపట్టాలి

నెహ్రూ నగర్‌: పాస్టర్‌ ప్రవీణ్‌ పగడాల మృతిపై సమగ్ర విచారణ జరిపించాలని దళిత క్రైస్తవ, ప్రజా సంఘాల నాయకులు డిమాండ్‌ చేశారు. భీమ్‌ సేన సేవాదళ్‌ రాష్ట్ర అధ్యక్షులు నల్లపు నీలాంబరం ఆధ్వర్యంలో బుధవారం లాడ్జి సెంటర్‌ అంబేడ్కర్‌ విగ్రహం వద్ద పాస్టర్‌ ప్రవీణ్‌ పగడాల మృతిపై నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఫాదర్‌ సుదర్శనం చంద్ర మాట్లాడుతూ పాస్టర్లపై దాడులను క్రైస్తవ మతంపై దాడులుగా భావిస్తున్నట్లు తెలిపారు. క్రైస్తవాన్ని బలహీనం చేస్తున్న వారిని లక్ష్యంగా చేసుకొని దాడులకు దిగటం దారుణమన్నారు. మత స్వేచ్ఛ, రాజ్యాంగ హక్కులను హరించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్‌ చేశారు. ప్రవీణ్‌ పగడాల పోస్టుమార్టం నివేదికను ఇప్పటి వరకు బహిర్గతం చేయకపోవడంపై అనేక అనుమానాలు వస్తున్నాయని అన్నారు. తక్షణమే పోస్టుమార్టం నివేదికను వెల్లడించాలని డిమాండ్‌ చేశారు. పాస్టర్లపై జరుగుతున్న దాడులను ఖండిస్తూ ఈనెల 30న నగరంలో దళిత క్రైస్తవులందరితో కలిసి లాడ్జి సెంటర్‌ నుంచి ఎస్పీ కార్యాలయం వరకు భారీ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

మెరుగైన సేవలు అందించాలి



ఫిరంగిపురం: ప్రజలకు ఆరోగ్యసిబ్బంది మెరుగైన సేవలు అందించాలని వైద్యాధికారి యామిగ్రేస్‌ అన్నారు. ప్రపంచ క్షయవ్యాధి నివారణ దినోత్సవం సందర్భంగా మండలంలోని నుదురుపాడు పీహెచ్‌సీలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో క్షయవ్యాధి సంబంధించి సేవలు అందించిన సిబ్బందికి ప్రశంసాపత్రాలు అందజేశారు. ఆరోగ్యకేంద్రంలో పని చేస్తున్న కె.సుదర్శనరావు (ఎంపీహెచ్‌ఎస్‌). పల్లవి (స్టాఫ్‌ నర్స్‌), బి.నారాయణరెడ్డికి జిల్లా అధికారుల తరఫున ప్రశంసాపత్రాలను యామిగ్రేస్‌ అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్‌ షరీనాబేగం, సిబ్బంది పాల్గొన్నారు.

కారు బీభత్సం.. ఒకరికి గాయాలు



పట్నంబజారు: మద్యం మత్తులో యువకుడు కారుతో బీభత్సం సృష్టించిన ఘటన నగరంలో చోటు చేసుకుంది. ఈస్ట్‌ ట్రాఫిక్‌ పోలీసులు తెలిపిన వివరాలు.. చిలకలూరిపేటకు చెందిన వంశీకృష్ణ బుధవారం సాయంత్రం మద్యం తాగి కారుతో విజయటాకీస్‌ నుంచి నాజ్‌సెంటర్‌ వైపు రాష్‌ డ్రైవింగ్‌ చేస్తూ రోడ్డుపై ప్రయాణిస్తున్న ప్రయాణికులతోపాటు, పలు వాహనాలను ఢీకొట్టాడు. ప్రమాదంలో ఒక వ్యక్తికి గాయాలు అయ్యాయి. క్షతగాత్రుడిని ఆసుపత్రికి తరలించారు. గాయపడ్డ వ్యక్తి వివరాలు తెలియాల్సి ఉంది. మద్యం మత్తులో కారు డ్రైవింగ్‌ చేసిన వంశీకృష్ణను స్థానికులు నిలువరించి దేహశుద్ధి చేశారు. భగవాన్‌ బొమ్మ సెంటర్‌ వద్ద విధులు నిర్వర్తిస్తున్న సిబ్బంది కారు, వంశీకృష్ణను స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

క్రమబద్ధీకరణకు ఈ నెల 31 వరకు మాత్రమే గడువు

నెహ్రూ నగర్‌: నగర పాలక సంస్థ పరిధిలో అనధికార లేఅవుట్లు, ప్లాట్లు, అనుమతి లేకుండా, అనుమతి పొందిన ప్లానుకు భిన్నంగా నిర్మించిన భవన సముదాయాలను బీపీఎస్‌ కింద క్రమబద్ధీకరణకు మార్చి 31వ తేదీ వరకు మాత్రమే గడువు ఉందని నగర కమిషనర్‌ పులి శ్రీనివాసులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. నగర ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ప్రతి కూడలిలో సీసీ కెమెరాలు



ఆత్మకూరు అండర్‌ పాస్‌ వద్ద సీసీ కెమెరాల ఏర్పాటు దృశ్యం



ఖాళీ ప్రదేశంలో కంప చెట్లు తొలగింపజేస్తున్న పోలీసులు

మంగళగిరి: స్థానికంగా నేరాలను అరికట్టేందుకు పోలీసులు ఆధునిక సాంకేతికతను వాడుతున్నారు. ఆయా కూడళ్లలో నిత్యం నిఘా ఏర్పాటు చేసేందుకు డ్రోన్‌లు వినియోగిస్తున్నారు. నగర పరిధితోపాటు నార్త్‌ సబ్‌ డివిజన్‌లో పోలీస్‌ స్టేషన్ల పరిధులలోని కూడళ్లలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పటికే మంగళగిరి రూరల్‌ పోలీస్‌ స్టేషన్‌ ఏరియాలోని ఆత్మకూరు జాతీయ రహదారి పక్కన సాయి బాబా ఆలయం, జాతీయ రహదారి వెంట ఏర్పాటు చేశారు. దుకాణాదారులు, ఇళ్ల యజమానులు కూడా వీటిని ఏర్పాటు చేసుకుంటే నేరాలను నియంత్రించడంతోపాటు నేరస్తులను సులభంగా పట్టుకునే వీలుంటుందని పేర్కొన్నారు.

ప్రజలు సహకరించాలి



సీసీ కెమెరాల ఏర్పాటుతో నేరాలను నియంత్రించడంతోపాటు నేరం జరిగితే నిందితులను వెంటనే పట్టుకోవచ్చు. పబ్లిక్‌ ప్రాంతాలలో, ఆయా సెంటర్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నాం. దుకాణాలు, వ్యాపారులు, ఆలయాలు, నిర్వాహకులు కూడా ఏర్పాటు చేసుకుని నేరాల నియంత్రణకు సహకరించాలి. నేరాల నియంత్రణలో పోలీసులకు సహకరించాలి.

– మురళీకృష్ణ, డీఎస్పీ, నార్త్‌ జోన్‌

28న రుణ అర్హత మేళా



పోస్టర్‌ ఆవిష్కరిస్తున్న ఎంపీడీవో, అధికారులు

తాడికొండ: ఈ నెల 28న తాడికొండ మండల పరిషత్‌ కార్యాలయంలో భారీ రుణ అర్హత మేళా నిర్వహించనున్నట్లు ఎంపీడీవో కె.సమతావాణి తెలిపారు. వివిధ కార్పొరేషన్‌ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు రుణ మేళాకు హాజరై అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. 28వ తేదీ ఉదయం 10 గంటలకు అభ్యర్థులు ఆన్‌లైన్‌ దరఖాస్తు పత్రంతోపాటు, ఆధార్‌, రేషన్‌, కుల ధ్రువీకరణ పత్రాలు తీసుకుని బ్యాంకు మేనేజర్ల సమక్షంలో జరిగే ఇంటర్వ్యూకు హాజరు కావాలని తెలిపారు. ఈ సందర్భంగా పోస్టర్‌ ఆవిష్కరించారు.

ఒకే షాపులో రోజుల వ్యవధిలో చోరీలు



దుండగులు వదిలి వెళ్లిన వస్తువులు

తాడేపల్లి రూరల్‌: మంగళగిరి ప్రకాశం బ్యారేజ్‌ పాత జాతీయ రహదారిలో తాడేపల్లి సాయిబాబా గుడి వద్ద ఓ దుకాణంలో రెండు రోజుల వ్యవధిలో రెండు సార్లు చోరీలు జరిగాయి. షాపు యజమాని డేవిడ్‌ రాజు కథనం ప్రకారం.. గుడి వద్ద రోడ్డు వెంబడి ఆయన పాన్‌, కూల్‌డ్రింక్‌ షాపు నడుపుతున్నారు. ఈ నెల 23వ తేదీన తెల్లవారుజామున మూడు గంటల సమయంలో షాపు తాళాలు పగలకొట్టి దుండగులు చోరీ చేశారు. ఆరు వేల నగదు, ఇతర సామగ్రిని, సిగరెట్లను దొంగిలించారు. తిరిగి బుధవారం తెల్లవారుజామున మూడు గంటల సమయంలో ఇద్దరు యువకులు షాపు బయట నిలబడగా, మరో ముగ్గురు లోపలకు వెళ్లారు. సిగరెట్లను, ఇతర వస్తువులను రెండు గోతాల్లో నింపుకొన్నారు. అది గమనించిన స్థానికులు సమాచారం ఇవ్వడంతో షాపు వద్దకు వచ్చేసరికి ఐదుగురు దొంగలు ద్విచక్రవాహనాలపై పారిపోయారు. ఒక సంచిని వదిలి వెళ్లిపోయారు. తాడేపల్లి పోలీసులకు ఫిర్యాదు చేసినట్టు బాధితుడు తెలిపారు.

ఇచ్చిన హామీని మంత్రి నిలబెట్టుకోవాలి



కార్మికులకు మద్దతు తెలుపుతున్న యూనియన్‌ నాయకులు

తాడేపల్లి రూరల్‌: ఎన్నికలకు ముందు ఏపీపీ సిమెంట్‌ ఫ్యాక్టరీ కార్మికులకు ఇచ్చిన హామీని మంత్రి నారా లోకేష్‌ నిలబెట్టుకోవాలని యూనియన్‌ నాయకులు కూరపాటి స్టీవెన్‌, కె. ఆదినారాయణలు డిమాండ్‌ చేశారు. బుధవారం తాడేపల్లి పట్టణ పరిధిలోని బ్రహ్మానందపురంలో ఏపీసీ కార్మికులు నిర్వహిస్తున్న దీక్షా శిబిరాన్ని సందర్శించారు. వారికి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం జోక్యం చేసుకుని కార్మికుల సమస్య పరిష్కరించాలని కోరారు. కార్మికుల తమకు రావాల్సిన బకాయిలను మాత్రమే అడుగుతున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సారమ్మ, ఇమానుల్‌, మల్లేశ్వరి, గురవయ్య, సుబ్బారావు, హర్షయ్య, బుజ్జి, రిబ్కా తదితరులు పాల్గొన్నారు.